# నైరుతి రుతు పవనాలు వచ్చేస్తున్నాయ్...తస్మాన్ జాగ్రత్తా!

- జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త : నైరుతి రుతు పవనాలు ముందుగానే వచ్చేస్తు న్నాయ్, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలో నైరుతి రుతు పవనాలువారం రోజులు ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో జిల్లాలో విరివిగా వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించి అన్ని శాఖల జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్స రంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి మరింత పటిష్టంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, నదీపరివాహక ప్రాంతాల్లో నివశిస్తున్న ప్రజలను ఆయా ప్రాంతాల డివిజన్, మండల, గ్రామ క్రింది స్థాయి అధికారులు ఎప్పకప్పుడు వారికి వర్షా సూచనలు తెలియజేస్తూ ఎక్కువ వర్షాలు పడితే ఆయా ప్రాంతాల్లో వరద ప్రవాహాల ఉధృత వలన కలిగే నష్టాలు వివరించడంతో పాటు వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చే విధగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించే అధికార, అనధికారులు, సిబ్బందిపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, తిరుపతి భాను ప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, రామ్మోహన్, తిరుపతి డీఎస్పీ, తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపరెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో సుశీలాదేవి, జెడ్పీ డెప్యూటీ సీఈవో, డీఎంహెచ్ఓ, సీపీవో, ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్ మత్స్యశాఖ, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్




# నైరుతి.. మార్చేనా రైతుల గతి

- భారీ వర్షాల కోసం పడమటి రైతాంగం ఎదురుచూపులు - ఇప్పటికే బీడువారిన చెరువులు..కుంటలు !!

కుప్పం, మే 30 ప్రభాతవార్త : ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాల్లో కొంత ముందుగానే ప్రవేశించడంతో రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. పడమటి మండలాల్లో చాలాచోట్ల గతేడాది ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లెతో పాటు పలు మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన విషయం విదితమే.గతేడాది రాష్ట్రం అంతా విస్తారంగా వర్షాలు కురిసి జలాశయాలు, ప్రాజెక్టులు నిండాయి. అయితే కుప్పం ప్రాంతంలో గతేడాది కురిసిన వర్షాలతో ఈ ప్రాంతాల రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో గతేడాది రైతులు ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుసెనగ పంటను చాలావరకు కోల్పోయారు. మరో పక్క చెరువుల్లో చుక్కనీరు నిల్వలేని పరిస్థితి ఏర్పడింది. కుప్పం నియోజకవర్గంలో సుమారు 545దాకా చిన్న,పెద్ద చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా నీరు లేక బోసిపోయి దర్శనమిస్తున్నాయి. కుప్పం పట్టణంకు తాగునీరు అందించే డికెపల్లి చెరువు నీరు లేక వెలవెలబోతోంది. కుప్పం ప్రాంతంలో దాదాపు 1200-1300 అడుగుల లోతులో పలుచోట్ల బోర్లు డ్రిల్ చేసినా నీరు రాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. అంతో ఇంతో పొలాల్లో బోర్లు కలిగిన రైతులు పంటలను సాగు చేశారు కానీ చెరువు ఆయకట్టు రైతులు పంటలుసాగుచేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈసారి నైరుతి రుతుపవనాలతో కురిసే వర్షాలపైనే రైతాంగం ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా కుప్పంతో పాటు పడమటి మండలాల్లో వర్షాధార పంట అయిన వేరుసెనగను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలతో భూమికి కొంత తేమ తగలడంతో రైతులు ప్రస్తుతం వేరుసెనగ సాగుకు దుక్కులు దున్నుతున్నారు. అయితే నైరుతి రుతుపవనాల ప్రభావం అధికంగా చూపి భారీ వర్షాలు పడితే తప్ప ఈ ప్రాంతంలో జలవనరులు జలకళ సంతరించుకోవు. కాగా ఈ ఏడాది సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం ప్రాంతంలో వేసవిని అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ధీటుగా ఎదుర్కొన్నారు. మంచినీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న గ్రామాల్లో బోర్లు వేయించి మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూశారు. దీంతో ఈ వేసవి కాలం గడచిపోయినట్లే. మరి వరుణదేవుడు పడమటి మండలాల రైతులపై, ప్రజలపై ఎలాంటి కరుణ చూపుతాడో వేచి చూడాల్సి ఉంది.

# 'సదరం' తిప్పలు

- నిర్ధారణకు వచ్చి ఆసుపత్రిలో వికలాంగుల నిరీక్షణ
- పట్టించుకోని వైద్యాధికారులు



చిత్తూరు, మే 30 ప్రభాతవార్త: ప్రభుత్వం మంజూరు చేస్తున్న వికలాంగ పెన్షన్ కోసం వికలాంగత్వ నిర్ధారణ చేసుకుని సర్టిఫికేట్ పొందడానికి అర్హులైన వికలాంగులు తిప్పలు పడుతున్నారు. వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడానికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు నిర్ణయించిన స్లాట్ మేరకు ఆసుపత్రికి వచ్చిన వికలాంగులకు ఆసుపత్రిలో చుక్కెదురవుతుంది. ఈ రోజు తమకు ఇచ్చిన స్లాట్ మేరకు ఆసుపత్రికి సదరం పరీక్షలు నిర్వహించుకోవాలని చెప్పడంతో ఇక్కడికి వచ్చామని అయితే ఇక్కడ ఈ రోజు సదరం పరీక్షలు నిర్వహించడం లేదని చెప్పి వెనక్కి వెళ్ళమంటున్నారని శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం పరీక్షలు చేసుకోవడానికి వచ్చిన కొంతమంది వికలాంగులు కన్నీటి పర్యంతం అయ్యారు. ఐరాల మండలం ఇరువారంపల్లి పంచాయతీకి చెందిన వికలాంగులకు స్లాట్ మేరకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం పరీక్షలు నిర్వహించాల్సివుంది. గ్రామ సచివాలయ సిబ్బంది సదరం సర్టిఫికేట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని శుక్రవారం వెళ్ళి సదరం పరీక్షలు చేసుకోవాలని చెప్పడంతో ఐరాల మండలం ఇరువారంపల్లి పంచాయతీకి చెందిన వికలాంగులు శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అయితే ఇక్కడ ఐరాల మండలం ఇరువారంపల్లి గ్రామంకు చెందిన వికలాంగులకు ఈ రోజు సదరం నిర్ధారణ పరీక్షలు లేదని ఈ రోజు గుడిపాల మండలానికి చెందిన వికలాంగులకు చేయాల్సివుందని వైద్యాధికారులు తేల్చి చెప్పారు. సదరం పరీక్షలు చేయకుంటే తమకు ఎందుకు శుక్రవారం ఆసుపత్రికి రమ్మని షెడ్యూల్ ఇచ్చారని కొంతమంది వికలాంగులు ఆసుపత్రి సిబ్బందిని నిలదీస్తే వారు ఎలాంటి సమాధానం ఇవ్వకుండా మిన్నకుండి పోయారు. ఈ విషయంపై ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది వద్ద నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అక్కడి నుండి వికలాంగులు సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసి అడిగితే వారు ఇచ్చిన షెడ్యూల్ మేరకు తాము చెప్పడం జరిగిందని, ఈ విషయంను మీరు అక్కడే తేల్చుకోవాలని చెప్పి మిన్నకుండిపోయారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐరాల మండలం ఇరువారంపల్లి గ్రామంకు చెందిన వికలాంగులు సదరం పరీక్షల కోసం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు వేచి చూసి ఎవరి నుండి సదరం పరీక్షలపై సమాధానం లేకపోవడంతో వెనుదిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మంజూరు చేసే వికలాంగ పెన్షన్లకు సంబంధించి వికలాంగత్వ నిర్ధారణ పరీక్షలను సదరం సర్టిఫికేట్ ద్వారా నిర్ధారిస్తారు. ఈ సదరం సర్టిఫికేట్ల వికలాంగత్వ నిర్ధారణ కోసం వికలాంగులు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాల్సివుంటుంది. ఈ మేరకు స్లాట్ తేదీ రోజున నిర్దేశించిన ఆసుపత్రికి వెళితే వారికి వైద్యాధికారులు సదరం పరీక్షలు చేసి వికలాంగత్వం నిర్ధారించి సర్టిఫికేట్లు మంజూరు చేశారు. ఈ పరీక్షలు నిర్వహించుకోవడానికి వికలాంగులు ఒక నెల రోజుల ముందు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్ళి స్లాట్ బుక్ చేసుకోవాల్సివుంటుంది. అయితే ఐరాల మండలం ఇరువారంపల్లి గ్రామంకు చెందిన వికలాంగులు గ్రామ సచివాలయంలో నెల రోజుల క్రితం స్లాట్ బుక్ చేసుకుంటే మే 30న చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం పరీక్షలకు హాజరు కావాలని సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వికలాంగత్వ నిర్ధారించుకోవడానికి వచ్చిన వారికి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చుక్కెదుదైంది. చిత్తూరు ఆసుపత్రి వైద్యాధికారులు శుక్రవారం గుడిపాల మండలానికి చెందిన వికలాంగులకు సదరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లు జారీ చేయగా ఇదే రోజు స్లాట్‌లో తేదీ వచ్చినప్పటికీ ఐరాల మండలం ఇరువారంపల్లి గ్రామంకు చెందిన వికలాంగులకు పరీక్షలు నిర్వహించలేదు. ఈ వికలాంగులు సదరం సర్టిఫికేట్ల కోసం మరోసారి గ్రామ సచివాలయంలో స్లాట్‌లు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు సదరం సర్టిఫికేట్ల జారీ విషయంలో వున్న ఇబ్బందులను తొలగించి స్లాట్ మేరకు వచ్చిన వికలాంగులకు సదరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# యోగాతో ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం

-చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మే 30 ప్రభాతవార్త: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రీ మెగా యోగా కార్యక్రమం శుక్రవారం ఉదయం చిత్తూరు పోలీసు శిక్షణా మైదానంలో 4 వేల మందితో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. యోగా కార్యక్రమం అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో 4 వేల మంది పాల్గొని యోగాసనాలు చేయడం జరిగిందన్నారు. సమయం వున్నప్పుడు ప్రతి ఒక్కరు యోగా చేయడం వల్ల ఎలాంటి మెడికల్ ఖర్చులు వుండవన్నారు. మే 21 నుండి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, జిల్లాలో ఆరు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించి వుండటంతో ఇప్పటికే రెండు యోగా కార్యక్రమాలు పూర్తి అయ్యాయన్నారు. అలాగే మిగిలిన యోగా కార్యక్రమాలు పెనుమూరు పులిగుండు, చౌడేపల్లి మండలం బోయకొండ, కుప్పం నియోజకవర్గంలో ననియాల, కంగుంది పోర్టు నందు యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 1 నుండి జిల్లా వ్యాప్తంగా 500 మంది మాస్టర్ ట్రైనర్స్‌కు శిక్షణ ఇప్పించడం జరిగిందని, వీరి ద్వారా జిల్లాలో 6 వేల మందికి శిక్షణ ఇప్పించి జూన్ 1 నుండి 20వ తేదీ వరకు ప్రతి మండలంలో గ్రామ స్థాయిలో యోగా గురించి పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎప్పుడు సమయం దొరికినా ప్రతి ఒక్కరు యోగా చేస్తే మంచి ఫలితాలు వుంటాయని, ఎలాంటి మెడికల్ ఖర్చులు వుండవన్నారు. యోగా గురించి పూర్తిగా అవగాహన చేసుకుని యోగ ప్రాణాయామం చేయడం వల్ల ప్రశాంతత, ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా శ్వాశ పెరుగుతుందని అందుకోసం ప్రతి ఒక్కరు ప్రతి రోజు యోగా చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ సుమిత్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి యోగా కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్‌కుమార్ ఆర్డీఓ భవానీ, జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు, జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి, జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, మెప్మా పిడి రాధమ్మ, డ్వామా ఎపిడి మల్లికార్జున, డిఎల్‌డిఎ రవికుమార్, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి వెంకటేశ్వరీ, దేవాదాయశాఖ సహాయ కమీషనర్ చిట్టెమ్మ, యోగా గురువు శ్రీనివాసులు నాయుడు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



యోగాంధ్రా కార్యక్రమంలో యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

# భద్రతపై సమన్వయ వ్యవస్థ

-భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం -రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్‌గుప్త



తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి: ప్రపంచప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల ఆలయంతోబాటు లక్షలాదిమంది భక్తుల భద్రతకు ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాట్లు అవసరం ఉందని రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్త పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో బాటు అలిపిరి వద్ద బహుళస్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలసి సెన్సార్ సిస్టమ్, ఆధునిక భద్రత పరికరాలు, సైబర్ భద్రత బలోపేతం చేయాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ డిజిపిగా పూర్తిస్థాయిలో నియమితులైన హరీష్‌కుమార్‌గుప్త శుక్రవారం అన్నమయ్య భవనంలో టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, అదనపుడిజి శాంతిభద్రతలు మధుసూదన్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డిజి మహేశచంద్రలడ్డా, అనంతపురం రేంజి డిఐజి షిమోషిబాజ్‌పేయి, ఐఎస్‌డబ్ల్యు ఎస్‌పి ఆరిఫ్‌హాఫీజ్, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, టిటిడి విఎస్ఓలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల డిఎస్పీ విజయశేఖర్‌తో కలసి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

# డ్రగ్స్ నియంత్రణకు...అవగాహనే ఏకైక మార్గం

- మాదక ద్రవ్యాల నిషేధంపై పోస్టర్లు విడుదల
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పిలుపు



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి కలెక్టరేట్, మే 30 ప్రభాత వార్త : జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు, ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సంయుక్తగా పిలుపు నిచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కో-ఆర్డినేషన్ కమిటి సమావేశం నిర్వహించి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వినియోగం వలన కలిగే దుష్పలి తాలను వారు యువతకు పెద్ద ఎత్తున వివరించడమే కాకుండా జిల్లాలో పూర్తస్థాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, ఇంటర్, డిగ్రీ, పీజీ ఆపై విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిషేదంపై పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాలినడక భక్తులకు...మరింత సౌలభ్యంగా టోకెన్ కౌంటర్లు

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: ఏడుకొండలవాడా వేంకటేశా...ఆపదమొక్కులవాడా గోవిందా నామస్మరణతో ఎంతో భక్తితో కాలినడకన తిరుమలకు చేరుకునే భక్తులకు జారీచేయాల్సిన "దివ్య"దర్శనమ్ టోకెన్లు పునరుద్దరణ నేటికీ జరగలేదు. టిటిడి పాలకమండలి, అధికారులు సామాన్యభక్తులకు దేవుని దర్శనమ్ మరింత తక్కువ సమయంలో సంతోషంగా చేయించాలనే తపనతో వినూత్నంగా ఆలోచన చేస్తున్నారు. అయితే కాలినడక భక్తులకు కూడా సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లే జారీ చేస్తుండటంతో దర్శనానికి దాదాపు ఆరేడు గంటలపైనే నిరీక్షణ తప్పడంలేదు. 2020 సంవత్సరానికి ముందు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనంలో కాలినడకన వచ్చే భక్తులకు ప్రత్యేకంగా దివ్య దర్శనమ్ పేరుతో అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గంలో టోకెన్లు జారీ చేసేవారు. రోజువారీగా 15వేల టోకెన్ల వరకు అందుబాటులో ఉండేది. ఆ తరువాత ఇప్పటివరకు దివ్యదర్శనమ్ టోకెన్లు పునరుద్దరణ కాలేదు. దీంతో కాలినడకన అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గంలో చేరుకునే భక్తులకు సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లే జారీఅవుతున్నాయి. ఈ టోకెన్లు తొలుత అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో ముందురోజురాత్రి 9గంటలనుండి జారీచేస్తున్నారు. భక్తుల రద్దీని బట్టి టోకెన్లు అందుకున్న భక్తులకు మరుసటిరోజు తెల్లవారు జామున 3 గంటలకు కూడా దర్శనం కేటాయిస్తున్నారు. టోకెన్లు అందుకున్న భక్తులు అదేరోజు రాత్రి తిరుమలకు చేరుకుంటే వారికి వసతి సౌకర్యం కూడా దొరకడం లేదు. ప్రస్తుతం చంద్రగిరి శ్రీనివాసమంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలోనే కాలినడక భక్తులకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ అవుతున్నాయి. అలిపిరి నడకమార్గంలో ఇప్పటికీ టోకెన్లు పునరుద్దరణ కాలేదు. భక్తులు కాలినడకన తిరుమలకు వచ్చినా వారికి సర్వదర్శనమ్ లోనే అనుమతించడం జరుగుతోంది. ఇలా రోజుకు శ్రీవారిమెట్టు మార్గంలో ఐదువేల మందివరకు భక్తులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. అయితే అలిపిరి మార్గంలో టోకెన్లు పునరుద్దరణ జరగకపోవడంతో ఈ ఒత్తిడి సరాసరి 10వేలమంది భక్తుల వరకు శ్రీవారిమెట్టు మార్గంపైనే చూపుతోంది. నడకదారిలో 15వేలమంది నుండి 20వేలమంది భక్తులు కాలినడక మార్గాల్లోనే చేరుకుంటున్నారు. మరీ వారాంతం శుక్ర, శని, ఆదివారాల్లో ఈ రద్దీ 25 వేలమంది వరకు కనిపిస్తుంది. ఇప్పుడు శ్రీవారిమెట్టు మార్గంలో కేవలం 3వేలనుండి 4వేల వరకు మాత్రమే సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరిగినా ఆ తరువాత మరుసటిరోజే టోకెన్లు జారీ జరుగుతుంది. భక్తులకు ఎలాంటి ఇబబందులు, అసౌకర్యం లేకుండా మెట్టవద్ద జారీచేసే టోకెన్లు కౌంటర్లను ఏకంగా శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోపలకు మార్చాలని నిర్ణయించారు. ఇందుకోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకునే దిశగా అడుగులేస్తున్నారు. టోకెన్లు జారీ దుర్వినియోగం కాకుండా చూడాలని విజిలెన్స్ విభాగానికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్పష్టం చేశారు.



# ఐదేళ్లలో అభివృద్ధి చేయలేకపోయాం... ఐదు నెలల్లో ఏం చేస్తాం!

- మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, మే 30 ప్రభాతవార్త : మున్సిపాలిటీలో ఐదేళ్లలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేకపోయామని, ఐదు నెలల్లో ఏమి చేయగలుగుతామంటూ శుక్రవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అధికారంలో ఉండి కూడా అభివృద్ధి పనులు చేయడంలో బాగా వెనుకబడిపోయామని కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశంలో గళమెత్తారు. కోఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సూళ్లూరు, నాగరాజపురం ప్రాంతాల్లో కనీసం డ్రైనేజి, సిమెంటు రోడ్లు కూడా వేయలేని పరిస్థితి ఉందన్నారు. హోలీక్రాస్ జంక్షన్ మొదలుకొని చెంగాళమ్మ గుడి వరకు ఉన్న జిఎన్‌టి రోడ్డు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు కూడా ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటుంటే మున్సిపల్ అధికారులు గాని, సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని జిఎన్‌టి రోడ్డులో డివైడర్లకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు ప్రత్యేకంగా డిజైన్ చేయించిన లైట్లను కూడా ఫ్లెక్సీ బోర్డులు పుణ్యమా అని పనికిరాకుండా పోయాయని తెలిపారు. వీటి స్థానంలో మున్సిపల్ అధికారులు ఫ్లెక్సీలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేసి వాటికి కొంత రుసుము నిర్ణయించి తీసుకుంటే మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడుతుందని సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అలాగే కౌన్సిలర్ కొండూరు జనార్ధన్ మాట్లాడుతూ గమండ్ల వీధిలో డ్రైనేజి సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. ఐదేళ్లుగా తాను ఈ విషయమై పోరాడుతున్నా ఫలితం దక్కలేదన్నారు. కౌన్సిలర్ పోలూరు పద్మ, మాముడూరు లక్ష్మమ్మ తదితరులు మాట్లాడుతూ బాపూజీకాలనీలోని సోనియానగర్‌లో, సూళ్లూరులోని బొగ్గుల కాలనీ, నాగరాజపురం ప్రాంతాల్లో డ్రైనేజి సమస్య ఎక్కువగా ఉందని, దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. గత ప్రభుత్వంలో నరకం అనుభవించామని, ప్రజలకు అభివృద్ధి చేయలేకపోగా వారి వద్ద మాటలు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు బస్సుల ఆగడాలు అరికట్టేందుకు పోలీసులు, మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. సూళ్లూరుపేటకు అత్యంత అవసరమైన చెంగాళమ్మ గుడి వద్ద కాళంగి నదిపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. నిరుపయోగంగా ఉన్న పోలీసు క్వార్టర్స్ స్థలంలో స్కూటర్ పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో చర్చించి అనుమతి మంజూరు చేసేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించాలని ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతో బజారు వీధుల్లో ట్రాఫిక్ నియంత్రణ సులువు అవుతుందని చెప్పారు.

**మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి :**

మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం కావస్తుందని, ఈ ఏడాదిలో గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించి గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజి నిర్మించామని చెప్పారు. ప్రస్తుతం మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్టి సారించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్‌లో ఉన్న మూడు కోట్ల 6లక్షల రూపాయలతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజి నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. హోలీక్రాస్ జంక్షన్ వద్ద వాటర్ ఫౌంటెయిన్‌లను, షార్ నమూనాలు ఏర్పాటు చేస్తామని, మన్నారుపోలూరు మార్గంలో ఉన్న నుడా ఆధ్వర్యంలో నిర్మితమైన పార్కును త్వరలోనే ఆధునికీకరిస్తామన్నారు. పట్టణంలో నెలకొని ఉన్న సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని నెలవల విజయశ్రీ హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ అంశాలను అజెండాలో పొందుపరచగా, ఇందులో రెండు అంశాలను వాయిదా వేసి మిగతా వాటిని ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య, కౌన్సిలర్లు చిన్ని సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.






## గంజాయి స్వాధీనం - వ్యక్తి అరెస్టు



గుడిపాల, మే 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని గొల్లమడుగు చెక్‌పోస్టు పరిసరాల్లో గుడిపాల పోలీసులు ఓ వ్యక్తి వద్ద నుండి గంజాయి స్వాధీనం చేసుకుని అతనిని అరెస్టు చేశారు. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు ఒడిసా రాష్ట్రం భద్రక్ జిల్లాకు చెందిన అశోక్‌దాస్ చిత్తూరు గాజులపల్లిలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఇటీవల తన సొంత రాష్ట్రం ఒడిసాకు తిరిగి వెళ్ళాడు. ఇలా వెళ్ళిన అశోక్‌దాస్ ఒడిసా రాష్ట్రం నుండి 3 వేల రూపాయలకు ఒక కేజీ గంజాయి తీసుకుని ఇక్కడికి వచ్చి ఆ గంజాయిని 20 వేల రూపాయలకు విక్రయించాలని నిర్ణయించి ఒక కేజీ గంజాయిని తీసుకువచ్చాడు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో అశోక్‌దాస్‌ను గొల్లమడుగు చెక్‌పోస్టు సమీపంలో శుక్రవారం అరెస్టు చేసి అతని నుండి ఒక కేజీ గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ సమాచారంను తహశీల్దారు జయంతికి తెలపడంతో సంఘటనా స్థలంకు తహసిల్దారు రావడంతో ఆమె సమక్షంలో అశోక్‌దాస్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నేడు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ

– 2.63 లక్షల పెన్షన్‌దారులకు రూ.112.73 కోట్లు పంపిణీ

– కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, మే 30 ప్రభాతవార్త:** జూన్ నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భరోసా పెన్షన్లు ఒక రోజు ముందుగానే అంటే శనివారం లబ్దిదారులకు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భరోసా పెన్షన్లను లబ్దిదారులకు శనివారం ఉదయం 6.30 గంటల నుండి ఇంటింటికి వెళ్ళి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. జిల్లాలో శనివారం ఒక్కరోజే వంద శాతం పెన్షన్లను పంపిణీ చేసి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు పర్యవేక్షించాలని, జూన్ నెలకు సంబంధించి 2,63,776 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌దారులకు 112.73 కోట్ల రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. శనివారం పెన్షన్లు ఏ కారణంతోనైనా తీసుకోని లబ్దిదారులు జూన్ 2వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వీరికి పెన్షన్ల మొత్తంను తప్పనిసరిగా పంపిణీ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## జడ్పీలో జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు

చిత్తూరు, మే 30 ప్రభాతవార్త:

జిల్లా పరిషత్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ల బదిలీలను జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు శుక్రవారం చేపట్టి పూర్తి చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో ఒకే ప్రదేశంలో ఐదు సంవత్సరాలు విధులు పూర్తి చేసుకున్న 15 మంది జూనియర్ అసిస్టెంట్లను గుర్తించి వారిని బదిలీ చేశారు. అలాగే బదిలో కోసం దరఖాస్తు చేసుకున్న 16 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఐదు సం॥ పూర్తి చేసుకున్న 9 మంది టైపిస్టులు, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న 9 మంది టైపిస్టులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించి జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రారంభమైన మహాభారత ఉత్సవాలు



శ్రీరంగరాజపురం, మే 30 ప్రభాతవార్త: శ్రీరంగరాజపురం పుల్లూరు క్రాస్ శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు మహాభారత ఉత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభం అయ్యాయి. ధ్వజారోహణంను సింధురాజపురం ఆలయ పురోహితులు హరిహరన్ గణపతి పూజ, యజ్ఞపూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు, పరిసర ప్రాంతాల గ్రామ పెద్దలు, భక్తులతో కలిసి ధ్వజారోహనంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా భారతి, సుబ్బరాయుడు కుటుం సభ్యులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త వేణునాయుడు మాట్లాడుతూ శుక్రవారం నుండి జూన్ 15వ తేదీ వరకు ఎస్ఆర్ పురం భారతం మిట్టలో జరిగే మహాభారత యజ్ఞానికి పరిసర ప్రాంత భక్తులు పాల్గొని వారి మొక్కులు తీర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వేణునాయుడు, గంధమనేని రాజశేఖర్‌నాయుడు, నారాయణస్వామి నాయుడు, ఎత్తిరాజులు నాయుడు, కేశవులునాయుడు, సుదర్శన్‌నాయుడు, మాధవ నాయుడు, గోవర్ధన్, బ్రహ్మానాయుడు, సర్పంచ్ హరిత కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు

– చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతను కలిసిన నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ



పాలసముద్రం, మే 30 ప్రభాతవార్త: పాలసముద్రం మండల పరిధిలోని వనదుర్గాపురం చలమరాజుఇండ్లు గ్రామం, వెంగళరాజుకుప్పం గుట్టమీద ఇండ్లు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జీ డాక్టర్ యుగంధర్‌పొన్నా చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చిత్తూరులో శుక్రవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ యుగంధర్‌పొన్నా చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలతను కలిశారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మండల అద్యక్షులు లతీష్, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, జనసేన నాయకులు రావూరి చందు, నియోజకవర్గ యువజన ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సంయుక్త కార్యదర్శి అన్నామలై తదితరులు పాల్గొన్నారు.

## యాళి వాహనంపై వరదుడు



యాదమరి, మే 30 ప్రభాతవార్త: శ్రీవరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వరదరాజులస్వామి యాళి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామివారిని మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆపై సప్రంలో ఉత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి యాళి వాహనంపై స్వామి వారిని అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు. స్వామి వారికి భక్తులు కర్పూర హారతులతో తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు బలిజ సంఘ నాయకులు గురుమూర్తి, రమేష్, దేవరాజులు, రామచంద్రనాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు.

## సబ్సిడీపై మామిడి రైతులకు ఈగ బుట్టలు సరఫరా

తవణంపల్లె, మే 30 ప్రభాతవార్త :

జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో తవణంపల్లె, బంగారు పాళ్యం, ఐరాల మండలాలకు చెందిన మామిడి రైతులకు సబ్సిడీపై పండు ఈగ బుట్టలను సరఫరా చేయనున్నట్లు ఉద్యాన అధికారిణి సాగరిక తెలిపారు. ప్రస్తుత ఏడాది వర్షాలు ముందుగా రావడంతో మామిడి తోటల్లో పండు ఈగ వున్నటు గుర్తించడం జరిగిందన్నారు. కావున పండుఈగ వల్ల కలిగే నష్టాన్ని నివారించడానికి ఒక బుట్ట, మూడు ల్యూర్లు, సబ్సిడీ ధరపై రైతులకు 11 రూపాయలకే అందించడం జరుగుతుందన్నారు. జూన్ 2 నుండి ఈబుట్టలు రైతులకు అందుబాటులో వుంటాయని ఆమె తెలిపారు.

## భక్తుల రద్దీతో జనసంద్రంగా కాణిపాకం ఆలయం

దర్శనానికి నాలుగు గంటల సమయం



**కాణిపాకం, మే 30 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయంలో శుక్రవారం భక్తుల రద్దీతో జనసంద్రంగా మారింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు,వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. అయితే శక్రవారం వారాంతపు రోజు కాకపోయినప్పటికి ఆలయంలో శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం కుంభాభిషేకం జరగడం, విద్యాసంస్థలు,పాఠశాలలకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు స్వామిదర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

## డిఇఓ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఆదేశాలు



కుప్పం, మే 30 ప్రభాతవార్త : హాకింగ్స్ పాఠశాలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేస్తూ ఈనెల 29న ఆదేశాలు జారీ చేసిందని హాకింగ్స్ పాఠశాల ఛైర్మన్ ఎస్‌డి హఫీజ్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు సిబిఎస్ఇ గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ 1-12 తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. అలాగే విద్యాశాఖచే సైతం తాము 2023-24సంవత్సరంలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొంది తరగతులు నిర్వహించామన్నారు. స్థానిక రాజకీయ కారణాలతో ఓ వ్యక్తి పాఠశాలపై ఫిర్యాదు చేయగా మే నెలలో తమకు వివరణ ఇవ్వాలని విద్యాశాఖాధికారులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో తాము అందుకు పూర్తి వివరాలు అందించామన్నారు. హైకోర్టు తీర్పుతో న్యాయం గెలిచిందని, తాము లాభాపేక్ష లేకుండా నాణ్యమైన విద్యను కుప్పం ప్రాంతం లో అందించాలనే లక్ష్యంతో పాఠశాల ప్రారంభించామన్నారు. పాఠశాల డైరెక్టర్ షబ్బీర్ పాల్గొన్నారు.

## వరంగల్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నేతలు



కుప్పం, మే 30 ప్రభాతవార్త : ఎమ్మార్పీఎస్ వ్యవసాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలికేందుకు కుప్పం నుంచి ఎమ్మార్పీఎస్ నేతలు వరంగల్‌కు తరలివెళ్లారు. ఈసందర్భంగా జిల్లా ఎమ్మార్ ఎిస్ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ మాదిగ జాతి ఆశాకిరణం మందకృష్ణకు పద్మశ్రీ పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు వెంకటేష్, గోవింద, జయప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

## చౌకదుకాణాల రికార్డులు పరిశీలన

కుప్పంరూరల్, మే 30 ప్రభాతవార్త :



మండలంలోని పలు ప్రభుత్వ చౌక దుకాణాల రికార్డులు, చౌక డీలర్ల వివరాలను శుక్రవారం తహశీల్దార్ చిట్టిబాబు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాలతో జూన్ 1నుంచి నిత్యావసర సరుకులు చౌక దుకాణాల ద్వారానే ప్రజలకు పంపిణీ చేయనున్న విషయం విదితమే. ప్రజలకు నిత్యావసరాలు పారదర్శకంగా అందేలాచర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



రామకుప్పం, మే 30ప్రభాతవార్త : కడప జిల్లాలో జరిగిన మహానాడు కార్యక్రమంకు వెళ్లిన ఓ వ్యక్తి తిరిగిరాక అదృశ్యమైనట్లు కుటుంబీకులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని సింగసముద్రం పంచాయతీకి చెందిన సుబ్బన్న అలియాస్ తిప్పన్న అనే వ్యక్తి మహానాడుకు వెళ్లి తిరుగు ప్రయాణంలో దారి తెలియక అదృశ్యమయ్యాడని ఫిర్యాదు అందిందన్నారు. సుబ్బన్నను గుర్తించిన వారు రామకుప్పం ఎస్సై వెంకటమోహన్ 94409 00703, ఎఎస్సై రెడ్డిశేఖర్ 9490586751నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అభిషేకాలతో దద్దరిల్లిన వైష్ణవీదేవీ ఆలయం



చౌడేపల్లి, మే 30 ప్రభాతవార్త : మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల వైష్ణవీదేవి ఆలయం అభిషేకాలతో దద్దరిల్లింది. ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో వైష్ణవీమాతా, అభయాంజనేయస్వామి, నాగభైరవ మూర్తులకు పంచామృతాభిషేకం జరిగింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ఉభయదారులు బాలాజీరావు, అనసూయమ్మ, ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డిలు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## గుండెపోటుతో వ్యక్తి మృతి



చౌడేపల్లి, మే 30 ప్రభాతవార్త : గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని పంచాయతీ కేంద్రం ఆమినిగుంటకు చెందిన మురళి(45)వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో యదావిధిగా కూలీ పనులకు వెళ్ళేందుకు బయలుదేరుతుండగా ఛాతీలో నొప్పి వచ్చిందని కేకలు వేసాడు. గ్రహించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం మదనపల్లిలోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు.మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తీర్థబాటిళ్ళ కౌంటర్ మార్పు



బోయకొండ(చౌడేపల్లి), మే 30 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో విక్రయించే తీర్థ బాటిళ్ళ కౌంటర్‌ను మార్చినట్లు ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. యాత్రీకుల సౌకర్యార్థం గతంలో వున్న విధంగానే మూలస్థాన అమ్మవారి ఎదురుగా కౌంటరును ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అదే విధంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి సన్నిధానంలో పలు క్యూలైన్లలో మార్పులు చేశామన్నారు.

## దురాక్రమణపై స్పందించండి



పుంగనూరు రూరల్, మే 30 ప్రభాతవార్త : పట్టణంలో వివిధ ప్రాంతాలలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో పలువురు ఫిర్యాదు చేశారు. తహసిల్దార్ రాము ఆధ్వర్యంలో శుక్రవారం కమిటీ సమావేశంజరిగింది. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నార్ అశోక్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ భూములు, చెరువులు దురాక్రమణకు గురవుతున్నయని పదే పదే అధికారులకు విన్నవించిన చర్యలు మాత్రం శూన్యమని ఆరోపించారు. అధికారులు నిర్లక్ష్యం వదిలి ఇప్పటికైనా స్పందించి చెరువులను కాపాడాలని అని డిమాండ్ చేశారు.

## ఆదివారం ఉదయంతోనే రేషన్ ఇవ్వాలి



పుంగనూరు రూరల్, మే 30 ప్రభాతవార్త : గ్రామీణ పట్టణ ప్రాంతాల పరిధిలో ఆదివారం ఉదయం నుంచినే నిత్యవసర సరుకులు రేషన్ దుకా ణంలో పంపిణీ చేయాలని తహశీల్దార్ రాము స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన పట్టణ గ్రామీణ ప్రాంతాలలో పలు రేషన్ దుకాణాలను డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ రెడ్డితో కలసి తనిఖీ చేశారు. పుంగనూరుపరిధిలో 50 రేషన్ దుకాణాలను తనిఖీ చేసి తగు సూచనలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఊజి బుట్టలకు దరఖాస్తు చేసుకోండి

సదుం, మే 30,ప్రభాతవార్త



ఉద్యానశాఖ ద్వారా రాయితీ పైన పంపిణి చేసే మామిడి ఊజీ బుట్టలు పంపిణికి సిద్ధంగా ఉన్నా యని అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని చౌడేపల్లె హార్టికల్చర్ అధికారి సంతోషిని అన్నారు. సోమవారం నుండి 5మండలాలకు (చౌడేపల్లి, సోమల, సదుం, పులిచర్ల, రొంపిచర్ల) సంబందించిన రాయితీ ఊజీ బుట్టలను చౌడేపల్లి ఉద్యాన కార్యాలయంలో పంపిణీ చేస్తారని చెప్పారు. ఒక్కొక ఊజీ బుట్ట మరియు 3టాబ్లెట్స్ కలిపి 11 రూపాయలకు ఇవ్వడం జరుగుతుందని. ఒక ఎకరానికి 8 బుట్టలు చొప్పున గారిష్టంగా ఒక్కొక రైతుకు 40 బుట్టలు వరకు రాయతీ పైన ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. రైతులు వచ్చేటప్పుడు యొక్క ఆధార్ కార్డు, ల్యాండ్ పాసుబుక్ రెండు తీసుకుని రావలెనని రైతులందరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## గంజాయి విక్రేతల అరెస్టు

-4 కేజీల గంజాయి స్వాధీనం



పలమనేరు,మే 30 ప్రభాతవార్త: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పలమనేరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డిఎస్పీ డి.ప్రభాకర్ మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు గంటావూరు సమీపంలో గంగవరం మండలం జే.కొత్తపల్లెకు చెందిన రాజేంద్ర(34) విశాఖ పట్టణం నుండి 4 కిలోల గంజాయి తీసుకువచ్చి పలమనేరు మండలం సాంబార్‌పూర్ గ్రామానికి చెందిన పి.మోహన్(48),మంజునాద్(28), కిషోర్(24) లకు విక్రయిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు.రాజేంద్రను విచారించగా విశాఖ పట్టణం,చింతలపల్లె గ్రామానికి చెందిన రాజు వద్ద నుండి 4 కిలోల గంజాయి కొనుగోలు చేసి విక్రయించడానికి ప్రయత్నించినట్లు తెలిపారన్నారు.ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ స్వర్ణతేజ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కడ సలహామండలి సభ్యుడికి సత్కారం

రామకుప్పం, మే 30 ప్రభాతవార్త :

కుప్పం ఏరియాడెవలప్‌మెంట్ అథారిటీ (కడ) రాజకీయ సలహామండలి సభ్యుడిగా నియమితుడైన



ముద్దన పల్లి రఘును శుక్రవారం రామకుప్పంలో దేశం నేతలు ఘనంగా సత్కరించారు. పార్టీలో కష్టపడే వారికి సిఎం చంద్రబాబునాయుడు తగు గుర్తింపు ఇస్తారన్నారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, సీతాపతి, రామూర్తి,శ్రీనివాసులురెడ్డి, చిన్నికృష్ణ, కృష్ణానాయక్, జయశంకర్, మనోహర్, గుర్రప్ప, ఆదిల్, అవినాష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, మే 30 ప్రభాతవార్త:



మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్రకుమార్ వాణి శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు సూపరెండెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు,స్థానిక ఎస్సై ధరణీధరలతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్దుని సన్నిధిలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ



కాణిపాకం, మే 30 ప్రభాతవార్త:

పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ శుక్రవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రధాన ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్వన ఏర్పాట్లు చేశారు.ఎమ్మెల్యే వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఐరాల జడ్పీటీసీ సుచిత్ర, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, మాజీ జడ్పీటీసీలు ఎం.లత, నరసింహులు నాయుడు, పూర్ణచంద్రరావు, శేషాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పానికి 2971 కొత్త పెన్షన్లు మంజూరు

కుప్పం, మే 30 ప్రభాతవార్త:
సిఎం చంద్రబాబునాయుడు స్వర్ణకుప్పం విజన్ 2029లో భాగంగా కుప్పం నియోజకవర్గంలో అర్హులైన 2971మందికి ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేసింది. ఈమేరకు మేరకు సెర్ప్ సిఇఒ కరుణ వాకాటి ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం నియోజకవర్గానికి సంబంధించి 7034 పెన్షన్ల మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిపాదన పంపారు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన 2971మందికి పెన్షన్లను మంజూరు చేశారు. 1612మందికి వృద్ధాప్య పింఛన్లు, 1359మందికి వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి ప్రతినెలా రూ 1కోటి 18లక్షల 84వేలను చెల్లించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్త పెన్షన్లు మే 2025నుంచి మంజూరుచేశారు. దీంతో లబ్ధిదారులకు జూన్ నెలనుంచే పెన్షన్లను అందించనున్నారు.

## మహానాడులో కేవీబీ పురం మండల టీడీపీ నాయకులు

కేవీబీ పురం, మే 30 ప్రభాతవార్త:



అట్టహాసంగా కడప వేదికగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు రెండో రోజు కార్యక్రమంలో సభాస్థలం వద్ద కేవీబీ పురం మండల టీడీపీ నేతలు రాష్ట్రటీడీపీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబు నాయుడు, పాతేరు సంఘ కన్వీనర్ వెంకటకృష్ణయ్య, సర్పంచ్‌సురేష్ చౌదరి, చెంచుప్రకాష్ యాదవ్, గురకల కండ్రిగ సర్పంచ్ రవి, సురేష్‌నాయుడు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## కేవీబీపురంలో 6,594 మందికి పింఛన్లు

కేవీబీపురం, మే 30 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలంలోని పింఛన్ లబ్దిదారులకు ఒక రోజు ముందుగా నగదు పంపిణీ చేస్తామని ఎంపీడీవో మాలతి తెలిపారు. మండలంలోని 19సచివాలయాల పరిధిలోని 6,594 మంది లబ్దిదారులకు రూ.2,87,91,500లు పంపిణీ చేస్తామని తెలిపారు. సచివాలయ సిబ్బంది 31వ తేదీ ఉదయం 7 గంటల నుంచి నగదు పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. లబ్దిదారులు ఇళ్ళ వద్ద అందుబాటులో ఉండాలని ఎంపీడీవో కోరారు.

## సబ్సిడీ ధరలకే జనుము, జీలుగ పంపిణీ

సత్యవేడు, మే 30 ప్రభాతవార్త:



సబ్సిడీ ధరలపై జనుము, జీలుగా విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పరమశివం సంయుక్తంగా జనుము, జీలుగా విత్తనాలను రైతులకు అందించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభాల బాటలోకి తీసుకురావడానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. ఇందులో భాగంగానే పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణం, భూసారాన్ని పెంచడానికి 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఏవో మురళి మాట్లాడుతూ మండలానికి జనుము 90 క్వింటాళ్లు, జీలుగ 95 క్వింటాళ్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈవిత్తనాలు విత్తిన 45 రోజుల తరువాత భూమిలో కలియ దున్నితే భూసారం పెరుగుతుందన్నారు. అందు వల్ల రైతులందరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శశిమోహన్‌నాయుడు, షణ్ముగం, గుర్రప్ప, వ్యవసాయశాఖ ఏవో మురళి, సిబ్బంది పూర్ణ, స్వర్ణ, మదన్‌మోహన్,మురళి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## వికలాంగుల ఇంటి వద్దకే రేషన్

సత్యవేడు, మే 30 ప్రభాతవార్త:



చౌక దుకాణాల ద్వారా జూన్ 1 నుంచి సంబంధిత డీలర్లే రేషన్ సరకులను లబ్దిదారులకు పంపిణీ చేయాలని తిరుపతి జిల్లా సత్యవేడు ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ రాజశేఖర్ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ సురేష్ మాట్లాడుతూ ఇన్నాళ్లు అమల్లో ఉన్నరేషన్ సరకుల డోర్ డెలివరీని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న పాత విధానాన్ని మళ్లీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగానే జూన్ 1 నుంచి చౌక దుకాణాల ద్వారా పండుగ వాతావరణం ఉట్టిపడేలా రేషన్ సరకులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెల 1 నుంచి 15 తేదీ వరకు రేషన్ డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ సరకులను లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. దుకాణాల వద్ద లబ్ధిదారులు ఎక్కువసేపు వేచి ఉండేటట్టు చేయరాదన్నారు. 8 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తప్పనిసరిగా లబ్ధిదారులకు అందించాలన్నారు. వృద్ధులకు, వికలాంగ లబ్ధిదారులకు డీలర్లే వారి ఇంటికి వెళ్లి రేషన్ సరకులను డోర్‌డెలివరీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సునల్ జైన్, చంద్రారెడ్డి, రవి, రఘునాథరెడ్డి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో ముగిసిన ఉచిత వేసవి శిబిరం

**సత్యవేడు, మే 30 ప్రభాతవార్త:** శ్రీసిటీ వేసవి శిబిరం(సమ్మర్ క్యాంపు) తమకు విజ్ఞానం, వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణతో పాటు వినోదం, అహ్లాదాన్ని పంచిందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. గత నెల 9న శ్రీసిటీ నైపుణ్య శిక్షణ కేంద్రంలో ప్రారంభమైన వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక ఈఎంసీ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ముగింపు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. వేసవి శిబిరం పట్ల విద్యార్థులు తమ అభిప్రాయాలను, మధురానుభూతులను పంచుకున్నారు. ఏప్రిల్ 9 నుంచి మే 30 వరకు 40 రోజుల పాటు జరిగిన వేసవి శిబిరంలో 9,10,11వ తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థులు 175 మంది హాజరు కాగా 50 మంది చివరి వరకు పాల్గొన్నారు. అనంతరం ముగింపు వేడుకల్లో విద్యార్థులు ఆట పాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. శ్రీసిటీ వైస్‌ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, శ్రీరామచంద్ర మెడికల్‌సెంటర్‌సులోచన,శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలందరికీ ఉచిత వైద్యం మెరుగుపరచండి

బర్డ్ డైరెక్టర్‌కు టిడిపి నేతల వినతి బర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ గూడూరు జగదీశ్‌ను టిడిపి నేతలు ఆర్‌సి మునికృష్ణ, ఊట్ల సురేంద్రనాయుడు, ధనంజయ్, జయంతి. తిరుపతిరావు మర్యాద పూర్వకంగా కలిశారు. నిర్వీర్యమైన బర్డ్‌లో పేదలందరికీ ఉచిత మెరుగైన వైద్యం అందించాలని కోరారు



ప్రభాతవార్త–తిరుపతి

## అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

– గిరిజనులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త :



ధర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పథకాన్ని జిల్లాలోని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా గిరిజనుల సాధికారత, ఆర్థిక, సామాజికాభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఈ కార్యక్రమంపై గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జూన్ 15 నుంచి 30వ తేది వరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తద్వారా గిరిజనులకు గృహాలు, రోడ్లు, తాగునీటి సౌకర్యాలు వంటి ప్రాథమిక వసతులు పై వినతి పత్రాలు స్వీకరించాలని ఆయన కోరారు. అలాగే ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, జనధన్ ఖాతా, కుల ధృవీకరణ పత్రాలు, సామాజిక భద్రత పెన్షన్స్ సంతృప్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రతి గిరిజన కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేశారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

భాకరాపేట, మే 30 ప్రభాతవార్త :

భాకరాపేట ఎస్సై రాఘవేంద్ర తెలిపిన వివరాల మేరకు చిన్నగొట్టిగల్లు గ్రామం జీడిబండ సమీపంలోని మామిడి తోటలో ఒక మగ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు అటుగా వెళ్తున్న వారు చూసి మాకు తెలిపారు అని అన్నారు తరువాత సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి అతను వివరాలుసేకరించే పనిలో ఉన్నామని ఎవరికైనా తెలిస్తే మాకు తెలపాలన్నారు.



## ఉగ్రవాదానికి నిరసనగా సిపిఎం పార్టీ ర్యాలీ

***రేణిగుంట, మే 30 ప్రభాతవార్త***



రేణిగుంట పట్టణంలో మతోన్మాదం ఉగ్రవాదానికి నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. ర్యాలీ ఇస్మాయిల్ మసీదు నుండి గాంధీ విగ్రహం వరకు రేణిగుంట పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగింది. హిందూ ముస్లిం క్రైస్తవ ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు రహీవుల్లా మాట్లాడుతూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. మతాల మధ్య చిచ్చు పెట్టొద్దని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటరమణ, హరినాథ్, సెల్వరాజ్, ఈశ్వరమ్మ, సహజ, యోగేష్, ఇస్మాయిల్, సాదిక్ భాషా, షేక్ బాషా, షాజహాన్, ఖాదర్ భాష, డ్రైవర్ వల్లి, కరిముల్లా, మర్జాన్, రఫీ ఉల్లా, మైను, అక్బర్, అలీ, ఇఫ్తికార్ అబ్దుల్లా, నజీర్, బషీర్, తదితరులు పాల్గొన్నారు..

## సంస్కృత వర్సిటీలో దూర విద్యకు దరఖాస్తులు

తిరుపతి విద్య, మే 30 ప్రభాత వార్త :




జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం దూరవిద్యా విభాగంలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నారు. సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు,డిప్లొమో,ప్రాక్ శాస్త్రి కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైంది.జూన్ 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.సమగ్ర సమాచారం కోసం 94402 26562 నెంబరులో సంప్రదించాలని ఆ వర్సిటీ దూర విద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథ్ కోరారు.

## పద్మావతీ అమ్మవారికి ఘనంగా ఊంజలసేవ

నారాయణవనం, మే 30 ప్రభాతవార్త :

నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.



## జనసేన నేత హరిప్రసాద్‌ని సత్కరించిన జడ్పీటీసీ

నారాయణవనం, మే 30 ప్రభాతవార్త :



రాష్ట్ర హస్తకళ చైర్మన్, తిరుపతి జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జడ్పీటీసీ, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ శుక్రవారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువతో సత్కరించారు. రాష్ట్ర హస్తకళ ఛైర్మన్‌గా నియమితులుకావడం పట్ల అభినందనలు తెలిపారు. హస్తకళ రాష్ట్ర ఛైర్మన్‌గా ఎన్నుకోవడం పట్ల కృతజ ్ఞతలు తెలిపారు. తనకు హరన్నతో గతంలోనే మంచి సంబందాలు వుందని గుర్తు చేశారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు మానిణ్యంరెడ్డి తదితరులు పాల్గొనా ్నరు.

## శ్రీవారి అభిషేకసేవలో నూతన డిజిపి హరీష్‌కుమార్‌గుప్త



తిరుమల,మే 30ప్రభాతవార్తప్రతినిధి:
రాష్ట్ర డిజిపిగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన హరీష్‌కుమార్ గుప్త శుక్రవారం వేకువజామున వెంకన్న అభిషేకసేవలో పాల్గోన్నారు. ఆయన స్వామివారి సేవలో పాల్గోని శ్రీవారి ఆశీస్సులు అందుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రం బహుకరించారు. ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమాం ్గుప్త వెంట అదనపుడిజి శాంతిభద్రతలు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, టిటిడి విఎస్‌ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ ఉన్నారు.

## పాపవినాశనం, ఆకాశగంగ అభివృద్ధిపై సమీక్ష

తిరుమల, మే 30ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాపవినాశనమ్, ఆకాశగంగ ప్రాంతాల పర్యావరణ. ఆధ్యాత్మిక అభివృద్ధిచేయాలని నిర్ణయించారు. శుక్రవారం రాత్రి తిరుమలలో టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సిఆర్ఓ, రెండు జలాశయాల ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు.

# తిరుపతి డివిజన్

## శభాష్ శంకర్...సీఎం నారా చంద్రబాబు

తిరుపతి కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త :



శభాష్ శంకర్ భాగున్నావా...సీఎం నారా చంద్రబాబు నాయుడు. సాక్ష్యాత్తు మహానాడు వేదికగా సీఎం నారా చంద్రబాబు తిరుపతికి చెందిన అఖిల భారత యాదవ్ మహాసభ యువజన రాష్ట్ర అధ్యక్షులు,టీడీపీ సీనియర్ యువ నేత శంకర్ యాదవ్‌ను పలకరించిన నేపథ్యం. తిరుపతి జిల్లా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి, అలాగే ప్రభుత్వ పరిపాలన కార్యక్రమాలకు తగిన తోడ్పాటును, అలాగే తిరుపతి డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో శంకర్ యాదవ్ చేసిన కృషిని సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాలువల్లో చెత్తను తొలగించండి కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, మే 30 ప్రభాతవార్త :




మురుగు కాలువల్లో ఎక్కడా చేతలేకుండా తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలో ఎన్.జీ.ఓ కాలనీ, కపిలతీర్థం రోడ్డు, ప్రకాశం పార్క్ రోడ్డు, కె.టి.రోడ్డు తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిని మందలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉదయాన్నే ప్రధాన రహదారుల్లో ముందుగా చెత్త కుప్పలు తొలగించాలని అన్నారు. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాబట్టి మురుగునీటి కాలువల్లో ఎక్కడా చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇండ్లలోని చెత్తను తమ కాలువల్లో వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి అందజేయాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ. రవీంద్ర రెడ్డి, నగరపాలక సంస్థ డి.ఈ. వెంకట ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## మే నెలలో మాత్రం పూసే పుష్పం మే పుష్పం

పాకాల, మే 30 ప్రభాతవార్త :



పాకాల మండలం కావలివారిపల్లెలోని క్రిష్ణమనేని సావిత్రమ్మ ఇంట్లో అరుదైన జాతికి చెందిన సంవత్సరానికి ఒక రోజే అది మే నెలలో మాత్రమే వికసించే అరుదైన మేడి పుష్మం పూయడం సంతో షకరమైన విషయమని ఈ పుష్పాన్ని చూడటానికి గ్రామస్తులందరూ ఆసక్తి చూపుతున్నారు అని సావిత్రమ్మ తెలియజేశారు.

## శ్రీవారి ఆశీస్సులుండాలి

తిరుపతి(రవాణ),మే 30 ప్రభాతవార్త : కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మరిన్ని ఉన్నతపదవులు అధిరోహించాలని బిజెపి నేతలు ఆ పార్టీ సోషల్‌మీడియా కన్వీనర్ నవీన్‌రాయల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయనన్ను బిజెపి నేతలు గుండాల గోపీనాథరెడ్డి, లోకప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సురేష్‌స్వామి, రాజశేఖర్‌రెడ్డి, వంశీనాగేశ్వరరావు నవీన్‌ను దుశ్శాలువతో సత్కరించారు



## మధురై మురుగన్ ఆలయం పరిరక్షణకు...

డిసిఎం పవన్‌కల్యాణ్‌కు వినతి



**తిరుపతి(రవాణ),మే 30ప్రభాతవార్త:** తమిళనాడు మధురైలోని మురుగన్ ఆలయం పరిరక్షణకు కృషి చేయాలని, భక్తులకు కనీస సౌకర్యాలు లేకపోతోందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఇందుకోసం జూన్ 22న ఆంధ్ర డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆలయాన్ని సందర్శించి, మధురై జిల్లాలోని మురుగన్ ఆలయానికి ధార్మికశాఖ నుండి విడుదలైన నిధులతో భక్తులకు సౌకర్యాలు లేకపోవడంపై విచారణ చేయాలన్నారు. ఆలయాన్ని రక్షించడానికి 22న మురుగన్ భక్త బృందంతో పవన్‌కల్యాణ్ సమావేశమవుతున్నట్లు చంద్రగిరి జనసేనపార్టీ ఇన్‌ఛార్జి తపసి మురళిరెడ్డి తెలిపారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి పవన్‌కల్యాణ్ 22న వస్తున్నట్లు మురుగన్ ఆలయ భక్తబృందానికి తెలిపారని మురళీరెడ్డి చెప్పారు.తిరుపతి,చంద్రగిరి నియోజకవర్గ జనసేన సైనికులు తరలిరావాలని ఆయన కోరారు

## లాసెట్ పరీక్ష నిర్వహణపై నేడు సమీక్ష


తిరుపతి(రవాణ),మే 30ప్రభాతవార్త :
రాష్ట్రవ్యాప్తంగా జూన్ 5న నిర్వహించే లాసెట్ ప్రవేశపరీక్షగురించి నేడు వివరాలు వెల్లడించనున్నారు.లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.సీతాకుమారి, పద్మావతి యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని పాల్గొంటారు

## సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్‌షైన్స్‌ని విడుదల చేసిన ఐటీసీ

తిరుపతి విద్య,మే 30 ప్రభాతవార్త :
ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్,తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసింది.ఇ ది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోంది.ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే అని,ఈ కరకరలాడే వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారు అని.ల,ఇది కుకీ యొక్క మెరుపును సజీవంగా తెస్తుంది అని అన్నారు.దీని కోసం మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీ ని విడుదల చేసింది, ఇది దాని తాజా ఆవిష్కరణ గురించి వెల్లడిస్తుంది అని సంస్థ ప్రతి నిధులు తెలిపారు.

## మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తాం : ఎమ్మెల్యే

తిరుపతి విద్య, మే 30 ప్రభాత వార్త :



ఇందిరా ప్రియదర్శినీ కూరగాయల మార్కెట్‌లో వాటర్ ట్యాంక్‌లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. మార్కెట్‌లో మౌళిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని ఆయన చెప్పారు. శుక్రవారం సాయంత్రం కూరగాయాల మార్కెట్‌లో కాంట్రాక్టర్ అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంక్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు.మార్కెట్‌కు వచ్చే వారికి ముఖ్యంగా రైతులకు, కూలీలకు, కొనుగోలుదారులకు తాగునీటి సమస్య వాటర్ ట్యాంకుల ఏర్పాటుతో పరిష్కారమైందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. మార్కెట్ లో స్ట్రీట్ లైట్స్, టాయిలెట్స్ ను ఏర్పాటు వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రోడ్డుపై వ్యాపారం సాగిస్తున్న చిరువ్యాపారులకు షెడ్స్ ఏర్పాటు చేసే అంశం కార్పోరేషన్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోను న్నట్లు ఆయన చెప్పారు. వ్యాపారం ఎలా సాగుతోంది, కూరగాయల ధరలు ఏ విధంగా ఉన్నాయని వ్యాపారస్థులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్ కే బాబు,అన్నారెడ్డి కృష్ణారెడ్డి, జానకిరామి రెడ్డి,దొరైరాజ్,రాజా రెడ్డి, విఆర్ వాసు,విఎస్ బాలాజీ,ఆకేపాటి సుభాషిణి,బండ్ల లక్ష్మీపతి,బాలిశెట్టి కిషోర్,వినోద్ రాయల్, పొటుకూరి ఆనంద్, భాను తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జర్నలిస్టులకు స్టిక్కర్లు పంపిణీ

– డీఐపీఆర్ఓ బాలకొండయ్య

తిరుపతి కలెక్టరేట్, మే 30 ప్రభాతవార్త :
జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మే 31 నాటికి ముగియనుంది. జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు మాసములకు పొడిగించడం జరిగింది. జూన్ 1వ తేది 2025 నుంచి ఆగష్టు 31, 2025 వరకు పొడిగింపులో భాగంగా సంబంధిత యాజమాన్యాల వారు వారి సంస్థ ద్వారా అక్రిడిటేషన్ సౌకర్యం పొంది ప్రస్తుతం పనిచేస్తున్న వారి వివరాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, తిరుపతి జిల్లా వారి కార్యాలయంలో సమర్పించి గడువు పెంపు స్టిక్కర్లు తీసుకోవాలని సంబంధిత యాజమాన్యాలకు డీఐపీఆర్ఓ బాలకొండయ్య తెలిపారు. ఈనెల 31వ తేది అనగా నేటి నుంచి కార్యాలయపు పనివేళల్లో సదరు స్టిక్కర్లు పొందగలరని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదర సోదరీమణులు, అలాగే యాజమాన్యాలు, ప్రతినిధులు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని బాలకొండయ్య విజ్ఞప్తి చేశారు.



## ఘనంగా హాజరత్ ఖాన్ షావలి గంధమహోత్సవం

వెంకటగిరి, మే 30 ప్రభాతవార్త : పట్టణంలోని కాంపౌండ్ వద్ద ఉన్న హాజరత్ ఖాన్ షావలి గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. 232 సంవత్సరాల నుండి షావలి గ్రంథ మహోత్సవాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాంపాలెం వద్ద ఆయన సమాధులను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించి ఘనంగా గంధ మహోత్సవం నిర్వహించారు.

## ఎమ్మెల్యేచే నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

వెంకటగిరి, మే 30 ప్రభాతవార్త: ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈనెల 31వ తేదీ పట్టణంలోని పదో వార్డులో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో 31వ తేదీ పెన్షన్లను లబ్ధిదారులకు ఇస్తున్నట్లు తెలిపారు. ఒకే రోజు అందరికీ పెన్షన్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

## పండుగ వాతావరణంలో రేషన్‌షాపులు ఏర్పాటు



కోట, మే 30 ప్రభాతవార్త : పండుగ వాతావరణాన్ని తలపించేలా రేషన్ షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు కోట మండల తహశీల్దార్ కె.జయ జయరావు చెప్పారు. శుక్రవారం ఆయన తన కార్యాలయ ంలో విలేఖరులతో మాట్లాడారు. కోట మండలంలో 34 రేషన్ షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో 16,128 మంది రేషన్‌కార్డుదారులు ఉన్నారని తెలిపారు. రేషన్ కార్డుదారులకు డీలర్లు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించాల్సి ఉందన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు ఇళ్లకు వెళ్లి సరుకులు అందించాలని తెలిపారు.

## లారీ బోల్తా ... డ్రైవర్ గాయాలు



పెళ్లకూరు మే 30 ప్రభాతవార్త : పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డీ పాలెం వద్ద 71 వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం లారీ బోల్తా పడింది తమిళనాడులోని రాణిపేట నుంచి వేలూరుకి యూరియా లోడ్ తో వెళుతున్న లారీ అదుపుతప్పి సర్వీస్ రోడ్డుకు ఉన్న భార్యకేడ్లను ఢీకొని రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది ఈ ప్రమాదంలో డ్రైవర్ శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎన్‌హెచ్ఐ అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గాయపడిన డ్రైవర్‌ని శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కి తరలించారు ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా తెలుస్తుంది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు

## బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు : సిడిపిఓ



కోట, మే 30 ప్రభాతవార్త : మండలంలో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే అటువంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సిడిపిఓ మునికుమారి చెప్పారు. శుక్రవారం కోట మండలం చిట్టేడు గ్రామంలో క్లస్టర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కొందరు తల్లిదండ్రుల్లో సామాజిక చైతన్యం కొరవడుతుందన్నారు. కనీస అవసరాలు తెలియడం లేదన్నారు. బాల్యంలోనే వివాహాలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు, తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్‌పై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## బడి గంట మోగక ముందే పుస్తకాలు

కోట.మే 30 ప్రభాతవార్త : సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు తెరిచే సరికి ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ ప్రణాళికబద్ధకంగా చాలా రోజుల కిందట నుంచే కసరత్తు చేస్తుంది. 1 నుంచి పదోవ తరగతి విద్యార్థులుకు రాత పుస్తకాలు కూడా పంపిణీ చేయున్నారు. ఇప్పటికి కోట మండలంలో 77 పాఠశాలలకు సంబంధించిన విద్యా మేటిరియల్ మండలంలో చేరిందని ఎంఇఒ డి.మస్తానయ్య చెప్పారు. 25 వేల పుస్తకాలు కూడా చేరాయిన్నారు.

## ముందుగానే మేఘాలు...పలకరించిన తొలకరి



కోట, మే 30 ప్రభాతవార్త : నైరుతి రుతుపవనాలతో నమోదైన వర్షపాతం మీదే అన్నదాతల భవితవ్యం ఆధారపడుతుంది. తొలకరి ఆలస్యమైతే ఆరుతడి పంటలపై కొంత ప్రతికూల ఫలితాలు ఉంటాయని అన్నదాతలు అభిప్రాయ పడుతుంటారు. మునుపెన్నడూ లేనివిధంగా రోహిణి కార్తెలోనే ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో గత వారంరోజులు నుంచి అడప దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దానికి ఊతమిచ్చేలా గతంతో పోలిస్తే రెండువారాలు ముందుగానే నైరుతి పలకరించింది. కోట మండలంలో ఇప్పటికే తూర్పు ప్రాంతంలో వరినాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. పడమర ప్రాంతంలో చిట్టేడు, గూడలి, చంద్రశేఖరపురం, కేశవరం, మద్దాలి తదితర గ్రామాల్లో బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. దీంతో ఆ ప్రాంత రైతాంగం కూడా పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావం, నైరుతి ఆగమనంతో వర్షాలు రెండు మూడురోజుల్లో కురుస్తాయని, అందుకు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు.

## హెల్మెట్ తప్పనిసరి ఎస్సై కె.అజయ్ కుమార్

దొరవారి సత్రం, మే 30 ప్రభాతవార్త: ద్విచక్ర వాహన దారులు కచ్చితంగా హెల్మెట్ దరించాలని ఎస్సై అజయ్ కుమార్ తెలిపారు శుక్రవారం దొరవారి సత్రం పరిధిలోని తల్లంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఇందిలో భాగంగా మోటర్ సైక్కిళ్ళు, ఆటోలు ఇతర వాహనాలను రికార్డలను పరిశీలించి సరిగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎవరైన సరే మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ముఖ్యంగా ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా లైసెన్సు మరియు హెల్మెట్ దరించాలని సూచించారు.

## హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



వెంకటగిరి, మే 30 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, జనసేన పార్టీ పిఏసి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైనటువంటి డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్‌ని తిరుపతిలో ఆయన నివాసం కాపు బలిజ సంఘం ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణ కలిసి అభినందనలు తెలిపారు. హరి ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జూన్ నెల రెండో తేదీ విజయవాడలో ఆయన బాధ్యతలు తీసుకుంటానని తెలిపారు.

## ఘంగా రోహిణీ సిందూరి జన్మదిన వేడుకలు



గూడూరు, మే 30 ప్రభాతవార్త : మన భారతదేశంలో ప్రభుత్వ కార్యాలయాలలో నిజాయితీగా పని చేసే అధికారులు కొద్ది మందే వుంటారని సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు తెలిపారు. ఆ కొద్ది మందిలో రోహిణీ సిందూరి ఒకరు ఈరోజు ఆవిడ పుట్టిన రోజు ఆవిడ దేశ భక్తి కలిగివున్న గొప్ప వ్యక్తి ఈవిడ లాగా నిజాయితీగా పని చేసే అధికారులు ప్రజల సంక్షేమం కోసం పని చేయడంలో ముందుంటారు. అజిత్ దోవల్, శిరీ మిశ్రా లాంటి వాళ్లకు పుట్టిన రోజు కార్యక్రమాలు చేయడానికి ప్రజలు ముందుకు రావాలి రోహిణీ సిందూరి గురించి ఉదాహరణకు చెప్పాలంటే కరోనా సమయంలో ప్రజల ముందుకు వెళ్లి వాళ్ల బాగోగులను పట్టించుకుని ప్రజలను కాపాడిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీగౌరి, గుబ్బా నరసింహులు కొంతమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి : సిడిపిఓ



వెంకటగిరి, మే 30 ప్రభాతవార్త: కిషోర్ బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సిడిపిఓ శంషాబాద్ తెలిపారు. కిషోర్ బాలికలకు వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కిషోర్ బాలికలు పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు.

## మురికి కాలువలో... ఇద్దరు పసికందులు మృత దేహాలు లభ్యం



గూడూరు, మే 30 ప్రభాతవార్త : మురికి కాలువలో ఇద్దరు పసికందులు మృతదేహాలు లభ్యమైన సంఘటన గూడూరు అశోక్ నగర్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తులు ఏడు నెలల ఇద్దరు పసికందులను పడేసారు. స్థానికులు గమనించి ఇద్దరు చిన్నారులు మృత దేహాలను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలువలో మృతదేహాలు కొట్టుకొని వచ్చాయా లేక ఎవరైనా తెచ్చి పడేసి ఉండవచ్చునని స్థానికులు అంటున్నారు.

## పౌర హక్కులు గురించి తెలుసుకోవాలి : తహశీల్దార్



గూడూరు, మే 30 ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు పౌర హక్కులు గురించి తెలుసుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా చిల్లకూరులోని కృష్ణాపురం గిరిజన కాలనీలో పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్క భారతీయ పౌరడు పౌర హక్కులు తెలుసుకొని దానికి అనుగుణంగా నడుచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గూడూరు నియోజకవర్గ రైతు ప్రధాన కార్యదర్శి కొండా రామచంద్ర రెడ్డి, మాజీ సర్పంచ్ నెల్లూరు రామూర్తి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కాటూరు నవీన్ చంద్ర, బీసీ సంఘ నాయకులు బెల్లంకొండ రాజేంద్ర, సోమశేఖర్, ఎస్ఐ సురేష్ బాబు, ఎస్సి, ఎస్టి అట్రాసిటీ నెంబర్ ఏసుపాక పెంచలయ్య, డివిఎంసి సభ్యులు మాకని వెంకటేశ్వర్లు, ఆర్ఐ పూర్ణ, విఆర్ఓ గిద్దలూరు రమణయ్య, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన సదస్సు



పెళ్లకూరు మే 30 ప్రభాతవార్త : మండలంలోని పెళ్లకూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యులు చిల్లకూరు గ్రామం నందు ప్రపంచ నాన్ కమ్యూని కబుల్ వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఇప్పుడు కాలంలో మనిషి పని ఒత్తిడి కారణంగా విశ్రాంతి లేకుండా పోతుందని దీని కారణంగా చాలామంది దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం అధిక రక్తపోటు బారిన పడుతున్నారు. గ్రామస్తులందరికీ ఈ వ్యాధులపై అనేక పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత డాక్టర్ జితేంద్ర హెచ్ విరూతీ వినయ ఏఎన్ఎం భూలక్ష్మి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## భార్యను హతమార్చిన కేసులో భర్త అరెస్టు!



నాయుడుపేట మే 30 ప్రభాతవార్త : మద్యం సేవించి మత్తులో కట్టుకున్న భార్యను హతమార్చిన సంఘటనలో నిందితుడైన మానికల శ్రీనివాసులను శుక్రవారం అరెస్టు చేసినట్లు నాయుడుపేట సిఐ బాబి తెలిపారు. ఈసందర్భంగా సిఐ మాట్లడుతూ నాయుడుపేట మండలంలోని కాలవగట్టులో నివాసం ఉంటున్న మానికల శ్రీనివాసులు, కృష్ణవేణి భార్యభర్తలు ఇద్దరు కలిసి మద్యంసేవించి మత్తులో ఘర్షణ పడ్డారు. ఈఘర్షణలో భర్త శ్రీనివాసులు భార్య కృష్ణవేణిని హత్యచేసి పరారైనట్లు తెలియజేశారు. భార్యను హత్యచేసిన కేసులో నిందితుడైన మానికల శ్రీనివాసులను మల్లాంజంక్షన్ వద్ద పట్టుకొని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సిఐ తెలిపారు. ఆయన వెంట ఎస్సై ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు : డిఎస్‌పి



నాయుడుపేట, మే 30 ప్రభాతవార్త : ప్రజలు ప్రతిరోజు యోగా చేయడం వల్లన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు తెలిపారు. యోగాం ధ్రా కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట పట్టణంలోని జడ్పిబాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో డిఎస్‌పి చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు యోగా నిర్వహించారు. డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ ప్రతిరోజు యోగా చేయడం వల్లన శరీర దృడత్వం, మానసిక ఒత్తిడి దూరమై సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. ప్రజలు తప్పనిసరిగా యోగా చేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమలో ఆయన వెంట సిఐలు సంఘమేశ్వరరావు, బాబి, ఎస్సైలు అయజ్‌కుమార్, నాగరాజు, ఆదిలక్ష్మి, పోలీసులు తదితరులు పాల్గోన్నారు.

# కాణిపాకంలో వైభవంగా మహాకుంభాభిషేకం






కాణిపాకం, మే 30 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం జీర్ణోద్దారణ, అష్టబంధనం, మహాసంప్రోక్షణ (మహా కుంభాభిషేకం) కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ మహాకుంభాభిషేకం శాస్త్రోక్తంగా అత్యంత వైభవోపేతగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ దాత అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులు, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, కాంట్రాక్టర్ శ్రీధర్‌రెడ్డి, సూపరిన్‌టెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ మాజీ ఛైర్మన్‌లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి, జడ్ ప్రటీసీ సుచిత్ర, టీడీపీ నాయకులు చెన్న కేశవులునాయుడు, హరిబాబు నాయుడు, పూర్ణచంద్రరావు, మదుసూధన్‌రావులతో పాటు ఆలయ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. ఈసందర ్భంగాఆలయ పునర్నిర్మాణ దాత అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులనుదేవస్థానంతరపున ఘనంగా సత్కరించారు.

**ఆకట్టుకున్న ప్రత్యేకాలంకరణ:**

శ్రీవీరాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో చేపట్టిన ప్రత్యేకాలంకరణ ఎంతో ఆకట్టుకుంది. కుంభాభిషేకం సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ దాతలు ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందర ంగా అలంకరించారు. ముఖ్యంగా బంగారు ధ్వజస్థంభంకు చేపట్టిన ప్రత్యేకాలంకరణ మరింతగా ఆకట్టుకుంది.

# రాజకీయమంటే కుట్రలు కాదు... ప్రజాభివృద్ధి

**- జనసేన నాయకులు వేణుగోపాల్ రెడ్డి**



పుంగనూరు, మే 30 ప్రభాతవార్త రాజకీయం అంటే కుట్రలు కుతంత్రాలు కులాల మధ్య చిచ్చు పెట్టడం కాదని, రాజకీయమంటే సమాజాభివృద్ధి ప్రజల ఉన్నతికి పాటుపడడమేనని తెలుసుకోవాలని జనసేన నాయకుడు వేణుగోపాల్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం ఉదయం చదళ్లలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఫంక్షన్ హాల్‌లో జనసేన కిట్ల పంపిణీ ఆయన చేతుల మీదుగా కార్యకర్తలకు అందజేయబడింది. ఈ సందర్భంగా ఆయన హాజరైన కార్యకర్తలు నాయకులకు ముఖ్యమైన సూచనలు అందజేశారు. ఇతర పార్టీల లాగా గ్రామాలలో కక్షలు కార్పణ్యాలకు జనసేనలో ఎప్పుడు చోటు లేదన్నారు. జనసేన కార్యకర్తలు నాయకులు ప్రతి గ్రామంలోనూ సమాజసేవకులై అంకితభావంతో పనిచేయాల న్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. పథకాల సద్వినియోగం చేసుకోవడంలో ప్రజలకు అండగా నిలవాలన్నారు. కార్యకర్తల చిత్తశుద్ధి ప్రజాసేవ వారి గుర్తింపునకు గీటురాయిగా నిలుస్తుంది అన్నారు. ఈసందర్భంగా జనసేన పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ లో భాగంగా పుంగనూరు నియోజక వర్గంలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న జనసేన పార్టీ కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డు తదితరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో దేశ రాజకీయాలలో పవన్ కల్యాణ్ గారు కీలకంగా వ్యవహరిస్తారని అలాంటి జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవడం అదృష్టంగా భావించాల న్నారు. అధిక క్రియాశీలక సభ్యత్వాలు చేసిన పలువురిని ఆయన సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివ కుమార్‌రెడ్డి, గాజుల నరేష్, విరూపాక్షి, చైతన్య రాయల్, పాముల హరి, నరేంద్రరెడ్డి, నారయణరెడ్డి, హరి నాయక్, బాలాజీ నాయక్, నాగభూషణం, చరణ్, జావేద్, నందు, చంద్ర, సుబ్బు, హరి నారాయణ, రఘు, ప్రసాద్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు మెహర్ ఆకస్మిక మృతి!

**-నివాళులర్పించిన వివిధ పార్టీలకు చెందిన నేతలు**



శ్రీకాళహస్తి, మే 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలంలో సీనియర్ రిపోర్టర్ గా సుదీర్ఘకాలం విధులు నిర్వహిస్తున్న మెహర్ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. వివాదహితుడిగా మంచి పేరు తెచ్చుకున్న మెహర్ మృతిని పలువురు జీర్ణించుకోలేక పోతున్నారు. పాత్రికేయ వృత్తిపట్ల నిబ్దతతో వ్యహరించే వ్యక్తిగా గుర్తింపు పొందారు. పెద్ద సంఖ్యలో నాయకులు అభిమానులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పలువురు తెలుగుదేశం నాయకులు, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కోలా ఆనందకుమార్, తొట్టంబేడు మండల ఎంపిపి ఉన్నం నిర్మల, తొట్టంబేడు మండలం టిడిపి అధ్యక్షులు మునిరాజనాయుడుతో పాటు కొంతమంది నేతలు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి పాత్రికేయులంతా దహన సంస్కారాలు పూర్తయ్య వరకు వారి పూర్తి సహకారాన్ని అందించారు.

## కీలక 'దారి'...భద్రత ఏదీ!

**తిరుపతిలో కాపువీధి కూడలిలో అభద్రతాభావం**

**-ఎవరు..ఎటెళ్తున్నారో....పసిగట్టేదెవరు?**

**ప్రభాతవార్త-తిరుపతి:**



స్మార్ట్‌సిటీ..ఆధ్యాత్మికనగరం తిరుపతిలో ఎంతో కీలకమైన ఈ దారిలో కనీసం భద్రత కరువైంది. నగరంలోని అన్ని ప్రధాన మార్గాలనుండి ఆర్టీసి బస్టాండుకు వెళ్ళే ప్రాధాన్యత ఉన్న ఈ దారి కూడలిలో ఎవరు..ఎటు వెళ్తున్నారు, ఎక్కడకు వస్తున్నారనేది కనిపెట్టడం కష్టంగా మారింది. ఇదేదో నగరశివార్లలో ఉన్న రోడ్డు అనుకుంటే పొరబడినట్లే. తిరుపతి నగరంలో ఆర్టీసి బస్టాండుకు, గ్రూప్ థియేటర్స్‌కు, ప్రదాన తపాల కార్యాలయం, తాతయ్యగుంట గంగమ్మగుడికి, చివరకు గాంధీరోడ్డుకు వెళ్ళే పెద్దకాపువీధి కూడలిగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. తిరుపతినగరంలో నేరాలనియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణతోబాటు రౌడీమూకల ఆగడాలకు అడ్డుకట్టవేసే రీతిలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ,పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎక్కడ చూసినా సిసి కెమెరాలు, సోలార్ సిసికెమెరాలు ఏర్పాటుచేసి నిఘానీడలో తిరుపతిని మార్చారు. అయితే వేలాదిమంది యాత్రికులు, పలురకాల వ్యాపారాల పై తిరుపతి గాందీరోడ్డు, ప్రధాన తపాల కార్యాలయం, ఇసుకవీధి ప్రాంతాలకు వెళ్ళేందుకు, తిరిగి బస్టాండుకు చేరుకునేందుకు కాపువీధి కూడలి జంక్షన్‌గా ఉంది. ఇక్కడ తెల్లవారుజాము, అర్ధరాత్రి అనిగాకుండా 24గంటలూ యాత్రికులు రాకపోకలు, నగరజనం సంచారం ఉంటుంది. ఈ కూడలిలో కనీసం సిసికెమెరాలు ఏర్పాటుకాలేదు. దీంతో ఎవరైనా కొత్తవ్యక్తుల అలజడి ఉన్నా, బయటి ప్రాంతాలనుండి అనుమానితులు వచ్చినా గుర్తించే పరిస్థితి లేదు. నగరంలో ఎంతో కీలకమైన ఈ కూడలిలో సిసికెమెరాల ఏర్పాటు అవసరం ఉంది. ఈ కూడలికి ఆనుకునే నెహ్రూవీధి, కాపువీధి, పెద్దకాపులేఔట్, సంధ్యథియేటర్ మార్గం, బస్టాండు ప్రాంతాలు ఉన్నాయి. సుమారు ఐదువేల మంది వరకు నగరవాసులు నివాసముంటున్న ప్రాంతం కూడా. ఇక్కడ చిన్నాచితకా మోస్తరు లాడ్జీలు, వ్యాపారదుకాణాలు ఉన్నాయి. ఈ కూడలిలో మద్యం సేవించి రౌడీమూకలు ఆగడాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈస్టుపోలీసుస్టేషన్‌కు కూతవేటుదూరంలోనే ఈ కూడలి ఉన్నా సిసికెమెరాలు ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. జిల్లా ఎస్పీ ఆ దిశగా తగిన చర్యలు తీసుకుని నగరాన్ని సేఫ్టీగా. నేరరహితంగా తీర్చిదిద్దడంలో కాపువీది కూడలి ప్రాదాన్యతతో సిసికెమెరాలు ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

## కార్పొరేషన్ జట్టుపై జేశాప్... తిరుపతి జట్టు ఘనవిజయం

**- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కెప్టెన్ శ్రీనివాసులు**




తిరుపతి క్రీడ, మే 30 ప్రభాతవార్త: రాష్ట్రంలోనే తిరుపతిలో మొట్ట మొదటి సారిగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఐపీఎల్‌ను తలపించే విధంగా నిర్వహించిన చిత్తూరు ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ (సిపిఎల్1)లో భాగంగా నిర్వహించిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ జట్టు వర్సెస్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జేశాప్) తిరుపతి జట్టు ఫ్రెండ్లీ మ్యాచ్ లో జేశాప్ తిరుపతి జట్టు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టీం పై 44 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జేశాప్ తిరుపతి జట్టు నిర్ణీత 16 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది.



బ్యాటింగ్ లో కెప్టెన్ శ్రీనివాసులు 35(30) అమర్ శేఖర్ 27(10), సుబ్బు 22(15), గుర్రప్ప 19(19) పరుగులతో రాణించారు. బౌలింగ్ లో కెప్టెన్ నాగరాజు మాత్రమే రెండు వికెట్లు తీసుకున్నారు. 142 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన మున్సిపల్ కార్పొరేషన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 97/7 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. బ్యాటింగ్ లో వెంకటేష్ 25(23) శ్రీహరిబాబు 18(21) పరుగులు చేశారు. బౌలింగ్ లో కెప్టెన్ శ్రీనివాసులు, చిన్నబాబు చెరో రెండు వికెట్లు తీసుకోగా, సి.శ్రీనివాసులు, గుర్రప్ప చెరో ఒక వికెట్ తీసుకున్నారు. బ్యాటింగ్‌లో 35 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు సాధించిన కెప్టెన్ శ్రీనివాసులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నారు. దీంతో జేషాప్ తిరుపతి జట్టు మున్సిపల్ కార్పొరేషన్ జట్టుపై 44 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. కెప్టెన్ శ్రీనివాసులుకి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏసీఏ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్, సిడిసిఎ అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా క్రికెటర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## రేణిగుంట అర్బన్ స్టేషన్లో పోక్సో కేసు నమోదు

.రేణిగుంట, మే 30 ప్రభాతవార్త : రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం ప్రసన్నకుమార్ అనే యువకునిపై పోక్సో కేసు నమోదయింది.. పోలీసుల కథనం మేరకు రేణిగుంట మండలం కరకంబాడి దగ్గర అభిరుచి హోటల్ నందు ఒంటరిగా ఉన్న చెంగారెడ్డిపల్లెకు చెందిన దళిత మహిళను లైంగికంగా వేధించాడంటూ బాధితురాలు ఫిర్యాదు మేరకు రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర ఫోక్సో, ఎస్సీ/ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేశారు. నిందితుని కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు